3



2050 నాటికి ప్రతి పది మందిలో ఒకరికి వినికిడి లోపం: మంత్రి కొండా సురేఖ

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -8 మంగళవారం 4 మార్చి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది

### కేంద్రమంత్రి సిఆర్ పాటిల్తో సిఎం రేవంత్ భేటీ

- కేటాయింపులకు మించి వాడుకుంటున్న ఏపి
- తెలంగాణ నికర జలాలలకు తీరని అన్యాయం
- కృష్ణా బేసిన్ నుంచి నీటి తరలింపు అడ్డుకోవాలి
- బనకచర్లకు గోదావరి తరలింపుపై కేంద్రానికి ఫిర్యాదు
- గోదావరి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలి
- పలు అంశాలపై వినతిపత్రం సమర్పణ



న్యూఢిలీ మార్చి3(జర్నలిస్ట్ వార్త):
కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక నీటిని తీసుకుంటోందని ఆయన విమర్శించారు. నీటి తరలింపును అడ్డుకోవాలని తాము కేంద్రాన్ని కోరామని స్పష్టం చేశారు. నికర జలాలలను సైతం వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. గోదావరి వరద జలాలను బనకచర్లకు తరలిస్తామని అంటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయిన సీఎం.. పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

మిగతా 2లో.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు

- సెంటీమీటర్ తవ్వడం చేతకాని రేవంత్..
- బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటు
- ఏ ప్రమాదం జరగ్గాకుండా 12 కిలో.మీ తవ్విన చరిత్ర బీఆర్ఎస్‌ది : కేటీఆర్



హైదరాబాద్: మార్చి3(జర్నలిస్ట్ వార్త):
ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం, 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. గత 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పండబెట్టి, తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలనే నీచానికి దిగడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, నాలుగు రోజులు కాకముందే ఎనిమిది మంది అమాయకుల నిండు ప్రాణాలను ఫణంగా పెట్టిన పాపం ముఖ్యమంత్రిదేనని చెప్పారు. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లయితే, 2005-2014 వరకున్న గత కాంగ్రెస్ సర్కారు హయాంలో తవ్విందే కేవలం 22.89 కిలోమీటర్లే అన్నారు. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా, ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తి చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ పనులకు రూ.3300 కోట్ల ఖర్చుచేస్తే, బీఆర్ఎస్ పాలనలో రూ.3900 కోట్ల పనులు పూర్తిచేసిన వాస్తవాన్ని దాచే ప్రయత్నంలో ముఖ్యమంత్రి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవాచేశారు. గత కాంగ్రెస్ సర్కారుకన్నా రూ.600 కోట్లు ఎక్కువ ఖర్చుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డి, మల్కా కొమురయ్య గెలుపు

- నల్గొండ-ఖమ్మం-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గెలుపు
- కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ నుండి మల్కా కొమురయ్య విజయం
- మల్కా కొమురయ్యకు మద్దతు పలికిన బీజేపీ





2లో.

## రేవంత్ రెడ్డికి సవాల్

- దుబాయ్‌లో సంబరాలు చేసుకున్నాడన్న
- రేవంత్ రెడ్డి విమర్శలపై స్పందించిన హరీశ్ రావు
- ఎస్ఎల్‌బీసీ ప్రమాదం ఫిబ్రవరి 22న జరిగిందన్న హరీశ్ రావు
- ఫిబ్రవరి 21న తాను దుబాయ్ వెళ్లానన్న హరీశ్ రావు
- ఎస్ఎల్‌బీసీ పనులు బీఆర్ఎస్ హయాంలో ప్రారంభం
- కాలేదని నిరూపించాలని సవాల్



2లో.

## కొత్త దంపతులు త్వరగా పిల్లలను కనాలి


- జనాభా పెంచడానికి ఇదొక్కటే మార్గం
- తమిళనాడు సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు



2లో.

## ఎంఎల్ఏ కోటా ఎంఎల్‌సి స్థానాల కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ

- అధికారపక్షం గెలిచే నాలుగు స్థానాల కోసం 20మంది పోటీ
- మిత్ర ధర్మం ప్రకారం కనీసం ఒక్కొక్క సీటైనా ఇవ్వాలంటున్న సిపిఐ, టిజెఎస్
- ఐదు స్థానాలకు నోటిఫికేషన్
- 10వరకు నామినేషన్ల దాఖలు
- 20న పోలింగ్, అదే రోజు కౌంటింగ్



2లో.

## యాడ్ ఏజెన్సీలే స్వయంగా తొలగించాలి

- హైదరాబాద్‌లోని అక్రమ హోర్డింగులపై హైడ్రా కమిషనర్ కీలక ఆదేశాలు
- అనుమతులు లేని హోర్డింగులను తొలగించాలని ఆదేశం
- ఆదివారంలోగా యాడ్ ఏజెన్సీలే స్వయంగా తొలగించాలన్న హైడ్రా కమిషనర్



హైదరాబాద్: మార్చి3(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్ నగరంలోని అక్రమ హోర్డింగులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అనుమతులు లేని ప్రకటనల హోర్డింగులను తొలగించాలని ఆదేశించారు. అనుమతులు లేని హోర్డింగులను యాడ్ ఏజెన్సీలే స్వయంగా తొలగించాలని స్పష్టం చేశారు.
అనుమతులు లేని హోర్డింగులను తొలగించేందుకు వచ్చే ఆదివారం వరకు గడువు ఇస్తున్నట్లు యాడ్ ఏజెన్సీలకు తేల్చి చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించి ఏర్పాటు చేసిన హోర్డింగులను ఆ తర్వాత హైడ్రా తొలగిస్తుందని స్పష్టం చేశారు. అక్రమ హోర్డింగుల తొలగింపులో ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.

## గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన గిర్ వణ్యప్రాణి సంరక్షణలో లయన్ సఫారీ



2లో.

## 5నిమిషాల గ్రేస్ టైమ్

- వార్షిక పరీక్షలకు 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు
- : ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య




3లో.

# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆయన మంత్రి ఉత్తమ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు తెలంగాణ ఎంపీలతోపాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల కేటాయింపు, వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ఇటీవల జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సంఘటనను సైతం మంత్రికి వీరు సోదాహరణగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతోన్న బనకచర్లపై తమ అభ్యంతరాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలియజేశామన్నారు. అయితే ఏపీ నుంచి ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమకు ఎలాంటి డీపీఆర్ రాలేదని మంత్రి వివరించారని చెప్పారని తెలిపారు. అలాగే పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క – సారక్క ప్రాజెక్టులకు.. త్వరగా నీటి కేటాయింపులు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన వివరించారు. ఇక తమ ప్రాజెక్టులకు సెంట్రల్ వాటర్ కమిషన్ క్లియరెన్స్ ఇంకా రాలేదని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరామని చెప్పారు. గోదావరి జలాలను అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర మంత్రికి వివరించామన్నారు. సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు ఇంత వరకు జరగలేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో తమ ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం చెబుతోందంటూ ఏపీపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తమ ప్రాజెక్టులకు, శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే నికర జలాలు ఉన్నాయనేది లెక్క తేలుతుందని ఆయన వివరించారు. తెలంగాణలో గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాత ఇతర ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. కృష్ణా బేసిన్‌లో ఏపీ సర్కార్ ఎక్కువ నీటిని తీసుకుంటోందని, అలా తీసుకోకుండా అడ్డుకోవాలని కేంద్రానికి చెప్పామన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్లపై తమ అభ్యంతరం తెలపగా.. తప్పకుండా జోక్యం చేసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. 'తెలంగాణలో గోదావరిపై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే జరగలేదు. మాకు కేటాయింపులు జరిగిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి. కృష్ణా జలాల విషయంలో వచ్చిన సమస్యలే భవిష్యత్‌లో గోదావరి విషయంలో వస్తాయి. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం తెలిపారు. 'బనకచర్లపై ఏపీ సర్కార్ ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని కేంద్రమంత్రి చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేటాయింపుల పెంపుపైనా చర్చించాం. పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులకు కేంద్రాన్ని నిధులు అడిగాం. మొత్తం ఐదు ప్రాజెక్టులకు నిధులు కోరాం. ఉమ్మడి ప్రాజెక్టులపై టెలిమెట్రీలను త్వరగా ఏర్పాటు చేయాలని అడిగాం. టెలిమెట్రీల ఏర్పాటుకు అవసరమైతే ఏపీ వాటా భరిస్తామని చెప్పాం. మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ రిపోర్టు త్వరగా ఇవ్వాలని కోరాం. అలాగైతే మేం చర్యలు చేపడతామని చెప్పాం' అని ఉత్తమ్ మీడియాకు వివరించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి ఆంధప్రదేశ్ తీసుకు వెళ్తున్న అధిక జలాలను ఆపాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను తాము కోరామన్నారు. కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకొని ఈ అన్యాయాన్ని ఆపాలని ఆయనకు విజ్ఞప్తి చేశామన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు తాము అభ్యంతరం చేప్పామని ఆయన స్పష్టం చేశారు. అయితే దీనిపై ఏపీ నుంచి ఎటువంటి నివేదిక రాలేదని.. ఈ అంశంలో తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్ ద్వారా తెలంగాణకు అధిక నీరు ఇచ్చేలా సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. పాలమూరు రంగారెడ్డి, సమ్మక్క సారక్క, సీతారామ సాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు నిధులు సైతం ఇవ్వాలని తాము అడిగాని వివరించారు. అలాగే కృష్ణా నదిలో శ్రీశైలం, నాగార్జున సాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో టెలీ మెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అవసరమైతే.. టెలిమెట్రీల కోసం తెలంగాణ, ఆంధ్రా వాటా ఖర్చు సైతం తామే భరిస్తామని కేంద్రానికి స్పష్టం చేశామని వివరించారు. తమ ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారన్నారు. మరోవైపు ఇండియా ఇన్‌ఫ్రాస్టక్చర్ ఫండ్ నుంచి తెలంగాణకు 50 ఏళ్ల పాటు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరామన్నారు. అలాగే మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నుంచి త్వరగా నివేదిక అందేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే తెలంగాణ జల వనరుల విషయంలో కేంద్రం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, తాను.. బలమైన వాదనలు వినిపించామని తెలిపారు. కృష్ణా జలాల వివాదంలో రోజు వారీగా కేంద్రం జోక్యం చేసుకుంటుందని హామీ ఇచ్చిందని చెప్పారు. అదే విధంగా దీర్ఘకాలికంగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని కోరాన్నారు. తుమ్మడిహట్టి సమీపంలో గతంలో కాంగ్రెస్ ప్రతిపాదించి పనులు మొదలు పెట్టనున్నామ న్నారు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో కూడా కేంద్రంతో చర్చించామన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ విషయంలో సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డి, మల్కా కొమురయ్య గెలుపు

హైదరాబాద్: మార్చి3(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ, బీజేపీ మద్దతిచ్చిన అభ్యర్థులు గెలుపొందారు. నల్గొండ–ఖమ్మం–వరంగల్ పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ ఎన్నికల్లో మల్కా కొమురయ్య విజయం సాధించారు. మల్కా కొమురయ్యకు బీజేపీ మద్దతు పలికింది.శ్రీపాల్ రెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లతో సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై శ్రీపాల్ రెడ్డి విజయం సాధించారు.బీజేపీ మద్దతు పలికిన మల్కా కొమురయ్యకు 12,959 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. ఆయన పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డిపై విజయం సాధించారు. విజయం సాధించేందుకు 12,081 ఓట్లుగా అధికారులు నిర్ధారించారు. మల్కా కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి.

# రేవంత్ రెడ్డికి సవాల్

### ఎస్ఎల్‌బీసీ పనులు బీఆర్ఎస్ హయాంలో ప్రారంభం

### కాలేదని నిరూపించాలని సవాల్

హైదరాబాద్:మార్చి3(జర్నలిస్ట్ వార్త): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగిన రోజు తాను దుబాయ్‌లో సంబరాలు చేసుకున్నానని కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.ప్రమాదం జరిగిన రోజు హరీశ్ రావు దుబాయ్‌లో దావత్ చేసుకున్నారని, రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చి రాజకీయం చేశాడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు కదా, మీరేమంటారని టీవీ9 మీడియా ప్రతినిధి ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి దివాలాకోరు రాజకీయానికి ఇది నిదర్శనమని హరీశ్ రావు బదులిచ్చారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కూతురు పెళ్లి వేడుకకు తాను దుబాయ్‌కి ఈ నెల 21న వెళ్లానని, ఎస్ఎల్‌బీసీ ప్రమాదం ఈ నెల 22వ తేదీ ఉదయం జరిగిందని, మధ్యాహ్నానికి ఈ ప్రమాదం వెలుగు చూసిందని గుర్తు చేశారు.సహచర ఎమ్మెల్యే ఇంట్లో వేడుకకు వెళ్లడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు స్పందించాల్సింది ప్రభుత్వమా? లేక ప్రతిపక్ష ఎమ్మెల్యేనా? అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లుగా భావిస్తున్నాడని చురక అంటించారు. తన తప్పును దాచుకోవడానికి రేవంత్ రెడ్డి గొంతు పెంచి మాట్లాడతాడని అన్నారు. ప్రతిపక్షాల మీద బురద జల్లి ప్రతి అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారని అన్నారు.ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యమే అని హరీశ్ రావు ఆరోపించారు. వారు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీ పనులు జరగలేదని నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు.

# కొత్త దంపతులు త్వరగా పిల్లలను కనాలి

### జనాభా పెంచడానికి ఇదొక్కటే మార్గం

### తమిళనాడు సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

చెన్నై మార్చి3(జర్నలిస్ట్ వార్త): ి:లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో జనాభా ప్రాతిపిదికన చేపడితే నష్టపోతామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఈ అంశంపై తాజాగా మరోసారి స్పందించిన స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమయం తీసుకోవాలని గతంలో నేనే చెప్పా. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోన్న వేళ ఇప్పుడలా చెప్పలేను. అంతకుముందు మేం కుటుంబనియంత్రణపై దృష్టిసారించాం. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డాం. అందుకే నేను కోరుకునేది ఒక్కటే. కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనండి. వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టండి' అని సీఎం రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొళత్తూర్‌లోని ఓ వివాహ వేడుకలోనూ స్టాలిన్ ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. 'పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టాం. కానీ, దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది' అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 5న సీఎం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి 8 నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన - గిర్ వణ్యప్రాణి సంరక్షణలో లయన్ సఫారీ

గాంధీనగర్,మార్చి3(జర్నలిస్ట్ వార్త): ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అందులోభాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా మోదీ



ఆదివారం రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం వంతారాను, సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సాసన్‌లోని రాష్ట్ర అటవీశాఖ అతిథిగృహమైన సిన్హ్ సదన్‌లో బస చేశారు. సోమవారం తెల్లవారుజామున గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయమైన ససన్ గిర్‌లో నిర్వహించనున్న నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ (ఔఃచిఒ) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఇందులో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పలు ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని ససన్‌లోని అటవీ సిబ్బందితో సంభాషించనున్నట్లు సమాచారం.

ఆసియాటిక్ సింహాలను సంరక్షించే లక్ష్యంతో ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,900 కోట్లకు పైగా నిధులు మంజూరుచేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం.. ఆసియాటిక్ సింహాలు గుజరాత్‌లోని గిర్ అడవుల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

## ఎంఎల్‌ఎ కోటా ఎంఎల్‌సి స్థానాల కోసం

# కాంగ్రెస్‌లో పోటాపోటీ

హైదరాబాద్: మార్చి3(జర్నలిస్ట్ వార్త):
ఎం ఎల్ఎ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. నోటిఫికేషన్ వెలువడటం తో అధికార కాంగ్రెస్ పార్టీలోని ఆశావ హులు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నా రు. వివిధ సందర్భాల్లో ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని హామీ దక్కించుకున్నవారు ఈసారి గట్టి ప్రయత్నాలు చేస్తుండగా, ఈ ఎమ్మెల్సీలో తమకు ఓ అవకా శం ఇవ్వాలని కాంగ్రెస్ మిత్ర పక్షాలు సైతం కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్నాయి. తాజాగా మిత్రపక్షాలు ఒకవైపు, పార్టీ ఆశావహులు ఒకవైపు పిసిసి అధ్యక్షుడిని, సిఎం రేవంత్‌లపై ఒత్తిడి తెస్తున్నట్టుగా సమాచారం. అయితే, పార్టీ ఆశావహుల్లో సుమారుగా 20 మంది ఎమ్మెల్సీ సీటుకోసం దరఖాస్తు చేసుకున్నట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే మిత్రపక్షాలకు ఎన్ని కేటాయించాలి, పార్టీ ఆశావహుల్లో ఎవరికీ ఈ సీట్లు కేటాయించాలన్న దానిపై టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సిఎం రేవంత్‌లు ఎలా ముందుకెళ్లాలన్న దానిపై తర్జనభర్జన పడుతున్నట్టుగా తెలిసింది.

**సిపిఐ, టిజేఎస్‌లు ఒక్కో సీటు కావాలని డిమాండ్‌శా.**

%ఇందులో భాగంగా ఇప్పటికే సిపిఐ రాష్ట్ర నేతల బృందం సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. తమ పార్టీ నుంచి ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని పిసిసి అధ్యక్షుడిని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిపిఐ, టిజేఎస్ కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది. అప్పటి నుంచి మిత్రపక్షంగా ఉన్న సిపిఐ, టిజేఎస్ పార్టీలు నామినేటెడ్ పోస్టులు, ఆయా ఎన్నికల్లో తమ వాటా కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఐ ఒక సీటు కోసం ప్రయత్నాలు చేసింది. కానీ, బిజెపిని ఓడించాలంటే తమ అభ్యర్థులే పోటీలో ఉండాలని కామ్రేడ్‌లనును కాంగ్రెస్ ఒప్పించింది. ఆ తర్వాత సిపిఐ నేతలు పలు సందర్భాల్లో ముఖ్యమంత్రిని కలిసి పదవుల విషయంలో చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో తాజాగా పిసిసి చీఫ్‌ను కలిసి ఎమ్మెల్సీ అవకాశంతో పాటు నామినేటెడ్ పోస్టులపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్న టిజేఎస్ సైతం ఎమ్మెల్సీ స్థానం కోసం అంతర్గతంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు



సమాచారం. ఇప్పటికే ఆ పార్టీ అధినేత కోదండరాంకు కాంగ్రెస్ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. అయితే ఒప్పందంలో భాగంగా మరో ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు కోరాలని టిజెఎస్ నేతలు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ప్రస్తుత పార్టీ బలబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్ కు 4 ఎమ్మెల్సీ సీట్లు, బిఆర్ఎస్‌కు 1 ఎమ్మెల్సీ సీటు దక్కే అవకాశం ఉంది. ఐదు కన్నా ఒక్క నామినేషన్ ఎక్కువగా దాఖలైతే పోలింగ్ ఉంటుంది. లేకుంటే అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. అయితే ఈ నాలుగు సీట్లు కాంగ్రెస్ కేడర్‌కే కేటాయించాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే 20 మంది ఆశావహులు ఈ ఎమ్మెల్సీ సీటు కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు తమవంతు ప్రయత్నంగా లాబీయింగ్ చేస్తున్నట్టుగా తెలిసింది. అయితే ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కో ఎమ్మెల్సీ సీటును ఇవ్వాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నట్టుగా తెలిసింది. అయితే ఇందులో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, రెడ్డి సామాజిక వర్గాలు తమకే ఎమ్మెల్సీ సీటును కేటాయించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్టుగా సమాచారం.

ఈసారి లంబాడా వర్గానికి ఎమ్మెల్సీ%శా.!

%ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీలు మాత్రమే ఉండడంతో ఏ సామాజిక వర్గాన్ని ఎలా సంతృప్తి పరచాలన్న దానిపై పార్టీ తర్జన భర్జన పడుతున్నట్టుగా తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనుండడంతో అన్ని వర్గాల వారిని సంతృప్తి పరచడం కాంగ్రెస్‌కు కత్తిమీది సాములా మారింది. ఎస్సీ సామాజిక వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ( మాదిగ ), పిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ( మాల), ఎస్టీల నుంచి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ( లంబాడా), ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ (లంబాడా ) సీటు ఆశిస్తున్నారు. మంత్రి వర్గంలో ఆదివాసీలకు ( సీతక్క ) ప్రాతినిథ్యం ఉండడంతో, ఈసారి లంబాడా వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బిసిల నుంచి యాదవ, కుర్మ, ముదిరాజ్‌లు

ఇక బిసిల నుంచి యాదవ, కుర్మ, ముదిరాజ్ లు బలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. యాదవుల నుంచి మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, పిసిసి ఉపాధ్యక్షుడు చరణ్ కౌశిక్, ఇటు కుర్మ సామాజిక వర్గం, మహిళా కోటా కింద గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితా యాదవ్, ముదిరాజ్ , మహిళా కోటా కింద రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు ప్రయత్నాలు చేస్తున్నారు. పిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ కూడా ఈ సీటు ఆశిస్తున్నట్టుగా తెలిసింది. మైనార్టీ కోటాలో సీనియర్ నేత షబ్బీర్ అలీ, నాంపల్లి ఇన్‌చార్జీ ఫిరోజ్ ఖాన్, సిఎం రేవంత్ సన్నిహితుడు ఫహీం ఖురేషీలు కూడా పోటీ పడుతున్నట్టుగా తెలిసింది. వీరితో పాటు ఓసీలో రెడ్డి సామాజిక వర్గం నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి, పిసిసి మీడియా ఇన్‌చార్జి సామ రాంమ్మోహన్ రెడ్డి, ఓసీ బ్రాహ్మణ కోటాలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కమ్మ సామాజిక వర్గం నుంచి కుసుమ కుమార్ ఈ సీట్లపై ఆశలు పెట్టుకోవడం విశేషం.

ఐదు స్థానాలకు నోటిఫికేషన్ విడుదల

రాష్ట్రంలో ఐదు ఎంఎల్‌ఎ కోటా ఎంఎల్‌సి స్థానాలకు ఈనెల 20న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు అవకాశం ఉంటుంది. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈనెల 20వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. తెలంగాణలో ఈనెల 29 నాటికి ఐదుగురి ఎంఎల్‌సిల పదవీకాలం ముగియనుంది. పదవీకాలం ముగిసే వారిలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎంఎల్‌ఎ కోటా ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది.

## 5నిమిషాల గ్రేస్ టైమ్

హైదరాబాద్ :మార్చి3(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో బుధవారం(మార్చి 5) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.45 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అయితే ఉదయం 9 తరువాత 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా కూడా అనుమతిస్తామని వెల్లడించారు.విద్యార్థులకు 1,2 నిమిషాలు
నుంచి 5 నిమిషాల వరకు గ్రేస్ టైమ్ ఇస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు వస్తే ఒఎంఆర్ షీట్ ప్రశాంతంగా నింపుకోవచ్చని, హడావుడి ఉండదని, ఒత్తిడి ఉండదని చెప్పారు. అందుకే ఉదయం 8.45 గంటల వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఇంటర్మీడియేట్ పరీక్షల నేపథ్యంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ జయప్రద భాయి, ఇతర అధికారులతో ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 9,96,971 మంది విద్యార్థులు హాజరుకానుండగా, అందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,88,448 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,40,788 మంది ఉన్నారని అన్నారు.
ఇంటర్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ కోసం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. దాంతోపాటు విద్యార్థుల ఫోన్లకే ఇంటర్మీడియేట్ హాల్ టికెట్లు పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎస్ఎంఎస్ లింకుపై క్లిక్ చేసి విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు.
ఇంటర్మీడియేట్ పరీక్షలు నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రశ్నపత్రం కూర్పు మొదలు కొని, పరీక్ష కేంద్రాల ఇన్విజిలేటర్ల వరకూ జాగ్రత్తలు పాటించామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రాలలో 5 నుంచి 6 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ద్వారా పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. కమాండ్ కంట్రోల్‌లో 31 స్క్రీన్లతో పరీక్షా కేంద్రాలు పర్యవేక్షించేలా ఏర్పాటు చేశామని, ఇందుకోసం 75 మంది సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్(బిఎన్ఎస్ 163) అమలులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం 1532 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1532 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 29,992 మంది ఇన్విజిలేటర్లను, 124 సిట్టింగ్ స్క్వాడ్లు, 72 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి నియమించినట్లు సెక్రటరీ వెల్లడించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ప్రిటెండ్ మెటీరియల్స్‌ను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉండదని చెప్పారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, సిబ్బందికి కూడా సెల్‌ఫోన్ అనుమతి ఉండదని అన్నారు. విద్యార్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడుపనున్నట్లు కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య సదుపాయాలు, ఒక నర్సు, ఒక ఆశా వర్కర్‌ను అందుబాటులో ఉంచేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు పడిశాల రఘు కుటుంబానికి ఆర్థిక సహాయం



సూర్యపేట/మార్చి 3(జర్నలిస్ట్ వార్త): కోదాడ పట్టణానికి చెందిన ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు పడిశాల రఘు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం చిలుకూరు మండల ఎంజెఎఫ్ తరఫున రఘ కుటుంబాన్ని పరామర్శించి, 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంజెఎఫ్ మండల అధ్యక్షులు కందుకూరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మల్లెపంగు ఉపేందర్, కార్యదర్శి కాంపాటి శ్రీను, కార్యదర్శి కందుకూరి వంశీకృష్ణ, కోశాధికారి నూకపంగు వీరబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ పరామర్శలో ఎంజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, పిడమర్తి గాంధీ, ఎంఎస్పి నియోజకవర్గ ఇన్చార్జి, జిల్లా అధికార ప్రతినిధి, ఏపూరి రాజు మాదిగ, ఎంజెఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీకాంత్, సీనియర్ జర్నలిస్ట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన
### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ





సూర్యాపేట/మార్చి 3(జర్నలిస్ట్ వార్త):ద
సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ పట్టణ కేంద్రానికి చెందిన మాదిగ జర్నలిస్ట్ ఫోరం(ఎంజెఎఫ్) నాయకులు పడిశాల రఘు ఇటీవల మృతి చెందారు. సోమవారం సమాచారం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ బాధిత కుటుంబాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రఘు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎం జె ఎఫ్ ఆధ్వర్యంలో తోటి సహోదరులకు ఎలాంటి సమస్యలు తలెత్తిన ఒకరికి మరొకరు చేయూతనిచ్చే విధంగా తయారు కావాలని మందకృష్ణ మాదిగ అన్నారు. కోదాడ ఎంజెఎఫ్ కమిటీ తరుపున బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించి చేయూతనిచ్చిన వారిని ఆయన అభినందించారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలలో ఎవరికి ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా చెదిరిపోకుండా ఒకరికి మరొకరు చేయూతనిచ్చి రక్షించుకునేందుకు ప్రయత్నం చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, ఎంజెఎఫ్ తోపాటు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు అండగా ఉంటాయని చెప్పారు. వారి వెంట ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



వరంగల్/మార్చి 3(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదన కలెక్టర్ జి. సంధ్యారాణి ప్రజావాణి ద్వారా ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులో పేర్కొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు (88) వచ్చాయని తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ, తక్షణ చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపైనే 23 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కలెక్టరేట్ సూపర్డెంట్ 15, జిల్లా వ్యవసాయ శాఖ 11, జిడబ్ల్యూఎం 2, డిసిఎస్ఓ 5 దరఖాస్తులు వచ్చాయని, మిగతావి వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపైన బాధితులు ఫిర్యాదులు సమర్పించారని పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి, పరిష్కరించలేని దరఖాస్తులను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో దరఖాస్తుదారునికి తెలియజేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. లేని ఎడల వచ్చిన దరఖాస్తు మళ్లీ మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు గ్రీవెన్స్ పోర్టల్ లో ఉన్న వివిధ శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీసీఈఓ రామ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిపిఓ కల్పన వరంగల్ తహశీల్దార్ ఇక్బాల్ సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కరాటేలో జాతీయ స్థాయిలో సత్తా చాటిన వేదం విద్యార్థులు





బోథ్/మార్చి3(జర్నలిస్ట్ వార్త): కరాటేలో జాతీయ స్థాయిలో సత్తా చాటి న విద్యార్థులను వేదం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ సోమవారం అభినందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదం పాఠశాల విద్యార్థులు మెడల్ లు సాధించడం చాలా గర్వకారణం ఉందన్నారు. 3వ నేషనల్ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్ గత నెలలో ని 20, 25 తేదీలలో నిర్వహించిన కరాటే పోటీల్లో జాతీయస్థాయిలో సత్తా చాటి వెండి,బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. జోహా సిల్వర్ కటాస్, హారిని సిల్వర్ కటాస్, సహస్ర సిల్వర్ కటాస్, మేఘన సిల్వర్ కటాస్ ,అభిలాష్ సిల్వర్ కటాస్, సాయి వర్ధన్ సిల్వర్ కటాస్, శ్రీమాన్ సిల్వర్ కటాస్, సంహిత సిల్వర్ కటాస్,,శ్రీ చరణ్ బ్రాంజ్ కటాస్ లు సాధించారాని తెలిపారు. విద్యార్థులని మెడల్స్ సాధించేలా తీర్చిదిద్దిన కరాటే మాస్టర్ రాజేశ్వర్ ని అభినందించారు.

## ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్



రాయపర్తి/మార్చి3(జర్నలిస్ట్ వార్త):మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారి గా మామునూరి శ్రీధర్ సోమవారం మండల కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్ లో పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధిగా పాఠశాలలకు హాజరుకావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం ఆయనను ఎంఆర్సి సిబ్బంది జెరిపోతుల యాకయ్య,శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి



రాయపర్తి/మార్చి3(జర్నలిస్ట్ వార్త:) రాయపర్తి మండలం మైలారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కంఠమేహేశ్వర స్వామి ఉత్సవాలలో సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,పూస మధు, ఏలమంచి శ్రీనివాస్ రెడ్డి, లేతా కుల రంగారెడ్డి, కోల సంపత్, అయిత రాంచందర్, బద్దం వేణుగోపాల్ రెడ్డి, లేతకుల సుధాకర్ రెడ్డి, చందు రాము యాదవ్, చందు సతీష్,సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 2050 నాటికి ప్రతి పది మందిలో ఒకరికి వినికిడి లోపం: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్: మార్చి3(జర్నలిస్ట్ వార్త):
ప్రపంచ జనాభాలో ఐదు శాతం కంటే ఎక్కువ మందికి అంటే సుమారు 43 కోట్ల మంది వినికిడి లోపంతో బాధపడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. అంతేకాకుండా 2050 నాటికి 70 కోట్లకు పైగా వ్యక్తులు, లేదా ప్రతి పది మందిలో ఒకరు, వినికిడి లోపంతో బాధపడుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు వెల్లడిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఒక ఇ.ఎన్.టి ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ సోమవారం గోడపత్రికను ఆవిష్కరించి, శస్త్ర చికిత్సను విజయవంతం చేసుకున్న చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అనంతరం వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ సరైన చర్యలు తీసుకుంటే బాల్యంలో కనీసం 60 శాతం వినికిడి లోపాన్ని నివారించవచ్చని అన్నారు.వినికిడి సమస్యను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిగమిద్దామని తెలిపారు. ఒక శబ్దాన్ని



వినగలగడం అనేది భగవంతుడు మన అందరికి ఇచ్చిన గొప్ప వరమని ఆమె పేర్కొన్నారు. అయితే, అటువంటి వారికి మనమంతా అండగా నిలిచి సహకరించాల్సిన అవసరం చాలా ఉందని మంత్రి నొక్కి చెప్పారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న పలు సమస్యల్లో వినికిడి లోపమనే సమస్య కూడా చాలా ప్రధానమైనదని మంత్రి చెప్పారు. సాధారణంగా చెవి వ్యాధుల చుట్టూ ఉన్న అపోహలు తొలగించేందుకు నడుం బిగించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. వినికిడి లోపానికి గల అనేక కారణాలను సరైన జాగ్రత్తతో నివారించవచ్చని చెప్పారు. వినికిడి లోపం ఉన్నవారికి సకాలంలో, తగిన మేరకు చికిత్స చేయించుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయవచ్చని చెప్పారు. దీనికి కావాల్సిందల్లా అవగాహన మాత్రమేనని అన్నారు.
ఏ వ్యాధికైనా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలనీ దీనికి ప్రభుత్వ,ప్రైవేటు రంగాలకు సంబంధించిన వారితో పాటు స్వచ్ఛంద సంస్థలు సహకారం తీసుకుని అవగాహన కల్పిస్తూ, ఈ వ్యాధి నియంత్రణకూ కలసి కట్టుగా సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే మానవతా దృక్పథంతో ఆలోచించి రూపాయికే వైద్యం అందించే వైద్యునిగా పేరుపొందిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకూ ఇవే వైద్య సేవలు అందలానే తపనతో ఆరోగ్య శ్రీకి శ్రీకారం చుట్టారనీ గుర్తు చేస్తూ, ఈ శస్త్ర చికిత్స విధానం అందరికీ అందాలనే అంశంపై మంత్రివర్గంతో పాటు సందర్భం వచ్చినప్పుడు ముఖ్యమంత్రితో కూడా చర్చిస్తానని తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే విషయాన్ని కూడా ప్రస్తావిస్తానని మంత్రి తెలిపారు.

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ జరగాలి

## - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి/మార్చి3(జర్నలిస్ట్ వార్త): ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ జరగాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వద్ద ఇసుక లభ్యత, అనుమతుల కొరకు ప్రతిపాదనలు ఇవ్వడం,నూతన రీచ్‌లు ఏర్పాటు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. అనుమతులు లేని ఇసుక తవ్వకాలను కఠినంగా అరికట్టేందుకు



రెవెన్యూ, పంచాయతి రాజ్, పోలీస్, రవాణా శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు జరిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా జరుగు ప్రాంతాలల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో ఉన్న ఇసుక లభ్యతపై ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకుప్రతిపాదనలు పంపాలని జిల్లా స్థాయి ఇసుక కమిటి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అక్రమ రవాణా జరిగినట్లయితే వాహనాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుక అక్రమంగా తరలిస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మైనింగ్ ఎడి జయరాజు, టిజిఎండిసి పిఓ శ్రీకాంత్, డిపిఓ నారాయణ రావు , ఇరిగేషన్
ఈ ఈలు పరశురాం, యాదగిరి, తిరుపతి, ఆర్డిఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ డ్రైవ్ స్కానింగ్ సెంటర్ల తనిఖీ



**భూపాలి పల్లి/మార్చి3(జర్నలిస్ట్ వార్త):** కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ ఆదేశానుసారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ల్లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లను స్పెషల్ డ్రైవ్ పీసీపీఎండ్ మిటీ మెంబర్స్ ద్వారా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆర్ ఆర్ డయాగ్నస్టిక్స్, లక్ష్మి డయాగ్నస్టిక్స్, కిరణ్ హాస్పిటల్, యోధ హాస్పిటల్, ప్రధాన్ హాస్పిటల్ నందు స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు డిసెంబర్ జనవరి ఫిబ్రవరి నెలలో నిర్వహించిన గర్భవతుల స్కానింగ్ వివరాలను ఫారం రికార్డులను, స్కానింగ్ మిషన్ వివరాలను తనిఖీ చేశారు, స్కానింగ్ కోసం వచ్చిన గర్భవతులకు లింగనిర్ధారణ నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే జైలు శిక్ష,పదివేల రూపాయల జరిమానా వేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాలో 9 స్కానింగ్ సెంటర్లు ఉండగా 5 సెంటర్లను నేడు తనిఖీ నిర్వహించడం జరిగినది మిగిలినవి రేపు నిర్వహిస్తామని తెలియజేసినారు నిర్దేశించినటువంటి ఫార్మేట్ లో వీరి యొక్క డేటాను పొందుపరిచి ఆన్లైన్లో సబ్మిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో డియేమ్ %ఊ% హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్, గైనకాలజిస్ట్ డాక్టర్ కవిత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఉమెన్ తాసిల్దార్ శ్వేత, ఉమెన్ పోలీస్ ఆఫీసర్ శ్రీలత, సఖి కన్సల్టెంట్ గాయత్రి, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే పది రోజులు అప్రమత్తంగా ఉండాలి

**- యాసంగి పంటల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి**


**- విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా చూడాలి**

**- గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి**

**- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలి**

**- కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**


**వరంగల్/మార్చి 3(జర్నలిస్ట్ వార్త):** పది రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా వరంగల్ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి వీక్షించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యాసంగి పంటలకు సాగునీటి సరఫరా అందించాలి, గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలి, ప్లాస్టిక్ ఫ్రీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లను



ఆదేశించారు. రాబోయే 10 రోజుల పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. యాసంగి పంటల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఆటంకం కలగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. రిజర్వాయర్ల నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేసి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాల్సిన భాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు.

### జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశించిన ప్రకారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడారు.





పంటలను సంరక్షించేలా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే 10 రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరాపై పర్యవేక్షణ కొనసాగించాలి, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, హార్టికల్చర్ అధికారి సంగీత లక్ష్మి, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత ఇతరత్రా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం





బోథ్/మార్చి3(జర్నలిస్ట్ వార్త): శ్రీ వెంకటేశ్వర స్వామి జాతరలో వైభవంగా స్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. బజారుహత్నూర్ మండలం జాతర్ల గ్రామము శ్రీ వెంకటేశ్వరా ఆలయంలో సోమవారం శ్రీదేవి భూదేవి సామెత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం మహోత్సవానికి ఎంపీ ఆదిలాబాద్ గోడం. నగేష్ కుటుంబ సభ్యులతో వేద పండితులతో శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం వైభావంగ జరుపుకొన్నారు.ప్రతియేట శివరాత్రి తదానంతరం ఎంపీ జి నగేష్ తన సొంత గ్రామము జాతర్ల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణం మహోత్సవం జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు, వేద పండితుల తదితరులు పాల్గొన్నారు.

# కిష్టారం సైలో బంకర్ పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో చర్చించిన డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి






సత్తుపల్లి/హైద్రాబాద్, మార్చి3(జర్నలిస్ట్ వార్త):కిష్టారం సైలో బంకర్ పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో .భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహఇంచార్జ్ డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి ఓ్రపకట ద్వారా తెలిపారు. కిష్టారం గ్రామానికి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సైలొ బంకర్ కారణంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డికి వివరించారు.కిష్టారం గ్రామ సమీపంలో సైలో బంకర్ నిర్మాణంలో నాణ్యత లోపం, అక్రమ అనుమతులు, బీటలు వాలిన బంకర్ వల్ల కిస్టారం అంబేద్కర్ నగర్ బీసీ కాలనీ ప్రజలు తీవ్ర ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. కిష్టారం గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని, నిబంధనలను అతిక్రమించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఉదంతం పై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సురక్షిత ప్రాంతంలో గ్రామ ప్రజలకు తక్షణ పునరావాసం కల్పించాలంటూ కేంద్ర మంత్రిని కోరారు.
సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో నిర్మించిన సింగరేణి కార్మికుల క్వార్టర్స్ లోపభూయిష్టంగా ఉండటమే కాకుండా అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డా. సుధాకర్ రెడ్డి కిషన్ రెడ్డికి వివరించారు.
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ విషయంపై సానుకూలంగా స్పందించి, తక్షణమే సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరుతానని, కిష్టారం గ్రామ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, కోయంబత్తూరులో కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను కలిసి విజిలెన్స్ విచారణ కోరిన విషయాన్ని కూడా డా. సుధాకర్ రెడ్డి కిషన్ రెడ్డికి తెలిపారు.

# విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలి

## -మట్టా దయానంద్ విజయ కుమార్

సత్తుపల్లి/మార్చి3(జర్నలిస్ట్ వార్త):విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండి శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాల మట్టా దయానంద్ విజయ కుమార్ అన్నారు. సోమవారం సత్తుపల్లి గుడిపాడు రోడ్ లో చైతన్య టెక్నో స్కూల్ ఆరవ వార్షికోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితిలో ముఖ్య శత్రువైన సెల్ ఫోన్ కు దూరంగా ఉండి శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వార్షికోత్సవ వేడుకలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయని తీలిపారు. యస్.యస్.సి.2024 లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా




సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్. రాజేశ్వరరావు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దోమా ఆనంద్ బాబు, జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాసరావు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ దూదిపాళ్ళ రాంబాబు.ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ, డైరక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, యం. రవికుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గోన్నారు







# తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడుతున్న నేరస్తుల అరెస్ట్

## - పట్టుకున్న పోలీసులను అభినందించిన ఏసిపి

వర్ధన్నపేట/మార్చి 3(జర్నలిస్ట్ వార్త): తాళం వేసి వున్న ఇండ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను వర్ధన్నపేట పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం వర్ధన్నపేట ఏసిపి అంబటి నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం తాళాలు వేసివున్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న వారిని వారు అరెస్ట్ చేశామని వివరించారు. అరెస్ట్ చేసిన నిందితుల నుండి సుమారు 5,86,000 రూపాయల విలువ గల 82 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి ఆభరణాలు, 90,000 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్టేషన్ ఘనపూర్ చెందిన జాడి శ్రీకాంత్ (24)సం:రాలు అనే యువకుడు రోజు వారిగా కూలి పని చేసేవాడు. పనిచేయగా వచ్చిన ఆదాయం తన జల్సాలకు సరిపోకపోవడం లేదని దొంగతనాలకు పాల్పడ్డాడు. వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫిరంగి గడ్, ప్రభుత్వ హాస్పిటల్ సమీపంలో ఉన్న పిల్లల్లో 82 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,05,000 నగదును చోరీ చేశాడని ఏసిపి వెల్లడించారు. దొంగతనాలకు పాల్పడి పట్టుబడిన జాడి శ్రీకాంత్ అనే నేరస్తునికి తోడు స్టేషన్ ఘనపూర్ చెందిన కోడెం గణేష్ (24) సం:రాలు అనే నిందితుడు డ్రైవర్ పని చేస్తూ వచ్చిన డబ్బులు సరిపోక శ్రీకాంత్ తో కలిసి దొంగతనాలకు పాల్పడినాడని ఏసిపి తెలిపారు. గతంలో శ్రీకాంత్ ధర్మసాగర్ సమీపంలో వివిధ



రకాల దొంగతనాలకు పాల్పడిన సందర్భాల్లో తనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలా కష్టపడి సంపాదించిన సొమ్ము వారి జల్సాలకు సరిపోవటం లేదని ఉద్దేశపూర్వకంగా దొంగతనాలకు సిద్ధమైన వారు దొంగిలించిన సొమ్మును తొర్రూర్ లో అమ్ముదామని వెళుతూ క్రమంలో వర్ధన్నపేట పోలీసులు దమ్మన్నపేట గ్రామ శివారులో వాహనాలు తనికి చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో నిందితులు పాల్పడిన నేరాన్ని పోలీసుల ఎదుట అంగీకరించారని వెల్లడించారు. నేరస్తుల ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని చాకచక్యంగా పట్టుకున్న సిఐ వర్ధన్నపేట, ఎస్సైలు చందర్, రాజు, వారి సిబ్బందిని ఏసిపి అభినందించారు

# రాంపూర్ శివారులో రోడ్డు ప్రమాదం


## - ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి



భూపాలపల్లి/మార్చి 3(జర్నలిస్ట్ వార్త): భూపాలపల్లి మండలం రాంపూర్ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురైన సంఘటన చోటు చేసుకుంది. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎదురు ఎదరుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురి కావడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు చెబుతున్నారు.

# చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా పటిష్ట చర్యలు

- రాబోయే 10 రోజుల పాటు నీటి సరఫరా పర్యవేక్షించాలి
- ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చర్యలు
- రిజర్వాయర్ల నుండి విడుదల చేసే నీటిని సమర్థవంతంగా వినియోగించాలి
- యాసంగి సాగు నీటి సరఫరా, గురుకులాల సందర్శనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిఎస్







హనుమకొండ/మార్చి 3(జర్నలిస్ట్ వార్త): చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం యాసంగి సాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ పని తీరుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. యాసంగి పంట సంరక్షణకు రాబోయే పది రోజులు చాలా కీలకమని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ సాగు నీరు, విద్యుత్తు సరఫరా అవసరమైన మేర పంట పొలాలకు చేరేలా చూడాలన్నారు. వ్యవసాయ శాఖకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని సిఎస్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. భారీ నీటి పారుదల శాఖ పరిధిలోని రిజర్వాయర్లలో అవసరమైన మేర సాగునీరు అందుబాటులో ఉందని, పంటలకు సమృద్ధిగా నీరు విడుదల చేయడం జరుగుతుందని, విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని అన్నారు. యాసంగి లో 77 లక్షల ఎకరాలలో సాగు జరుగుతోందని, ముఖ్యంగా వరి పంట 54.82 లక్షల ఎకరాల సాగు జరిగింది. గత సంవత్సరం కంటే 2 లక్షల 70 వేల ఎకరాలు వరి, లక్ష ఎకరాల మొక్కజొన్న పంట అధికంగా పండుతుందని తెలిపారు. సిద్దిపేట, జనగామ, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, వనపర్తి మొదలగు జిల్లాలో కొన్ని సమస్యలు ఉన్నాయని వీటిని పక్కగా పర్యవేక్షిస్తూ పొలాలు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు రాక పోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల కొంత మేరకు రైతులు ఇబ్బందులకు గురి కావడం గమనించామని అన్నారు. ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ఎస్సారె-స్పీ, ఎస్సారెస్పీ స్టేజి 2, నాగార్జున సాగర్, ఏఎంఆర్ లిఫ్ట్, కల్వకుర్తి, ఇతర ప్రాజెక్టుల కింద నిర్దేశిత పంట పొలాలకు సాగునీరు అందాలని సీఎస్ తెలిపారు. రాబోయే 10 రోజుల్లో క్షేత్రస్థాయి నుంచి వచ్చే డిమాండ్ అనుగుణంగా సాగునీరు విడుదల చేస్తూ, రైతుల పొలాలు ఎండిపోకుండా కాపాడాలని సిఎస్ ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఎక్కడ లోటు రాకుండా చూసుకోవాలని, సీఎస్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పీక్ డిమాండ్ కు మరో 10 నుంచి 15 శాతం పెరిగినా తట్టుకునేలా విద్యుత్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండాలని సీఎస్ పేర్కొన్నారు. సాగు నీరు సరఫరా, పంటల పరిస్థితుల పై పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించాలని, రైతులు ఆందోళనకు గురికాకుండా సమృద్ధిగా సాగు నీటి సరఫరా అవుతుందని భరోసా కల్పించాలని, క్షేత్రస్థాయిలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని అన్నారు. రాబోయే 10 రోజులపాటు వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ లెవెల్ లో రైతులతో సంప్రదింపులు జరుపుతూ ఉండాలని అన్నారు. సాగు నీరు ఇబ్బందులు ఏర్పడే జిల్లాలలో మండలాల వారీగా తహసిల్దార్, నీటిపారుదల శాఖ ఇంజనీర్, వ్యవసాయ అధికారితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా పర్యటించాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ ల తనిఖీ తర్వాత పరిస్థితులలో మార్పులు వచ్చాయని, పిల్లలకు అందించే ఆహార నాణ్యత పెరిగిందని, కామన్ మెన్యూ డైట్ పక్కాగా అమలు అవుతుందని అన్నారు. సింగిల్ యూసెజ్ ప్లాస్టిక్ నిషేధం సంబంధించి ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చర్యలు తీసుకోవాలని సిఎస్ తెలిపారు. వారి వెంట దేవాదుల సీఈ అశోక్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలలో ఘనంగా ఫన్ ఫెస్ట్ ఉత్సవం









సత్తుపల్లి/మార్చి3(జర్నలిస్ట్ వార్త): సత్తుపల్లి లోని త్రివేణి పాఠశాలలో ఫన్ ఫెస్ట్ ఉత్సవం లో విద్యార్థులు వివిధ నృత్య కళ రూపాల, ఆనందోత్సాహాల నడుమ తల్లిదండ్రుల సందడి తో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి సీఐ కిరణ్ కుమార్, సింగరేణి పి ఓ ప్రహ్లాద్ పాల్గొని విద్యార్థులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులకి విద్యా విజ్ఞానం తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన విద్యార్థులలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలు వెలికి తీయడానికి దోహద పడతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల నృత్యాలతో అలరించారు, ఈ కార్యక్రమం లో ఈ త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థలు డైరెక్టర్స్ వీరేంద్ర చౌదరి, జగదీష్,సి సీ ఆర్ ఓ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సరిత, కిడ్స్ ఇంచార్జి శ్రీ పద్మ, కాంపస్ ఇంచార్జి వంశీ, అకడమిక్ ఇంచార్జి పవన్ కుమార్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆస్తి కోసం తల్లిని హత్య చేసిన తనయుడు

హైదరాబాద్,మార్చి3(జర్నలిస్ట్ వార్త): నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని కనికరం ఓ కసాయి హత్య చేశాడు. ఆస్తి కోసం కన్నతల్లినే కర్కశంగా కత్తితో పొడిచి చంపాడు. వివరాల్లోకి వెళ్తే... తెల్లాపూర్ దివినో విల్లాస్‌లో నివాసముం టున్న రాధిక (52) ను ఆమె కొడుకు కార్తీక్ రెడ్డి సోమవారం ఉదయం ఆస్తి కోసం తల్లితో గొడవ పడ్డాడు. ఈక్రమంలో తల్లిపై కత్తితో దాడి చేసి ఎనిమిదిసార్లు పొడిచాడు. గమనించిన స్థానికులు రాధికను హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాధిక మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుడు మత్తు పదార్థాలు సేవిస్తూ, మద్యానికి బానిసైనట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడి

## 10వేలు లంచం తీసుకుంటుండగా సబ్ రిజిస్ట్రార్‌ను పట్టుకున్న అధికారులు

నిజామాబాద్, మార్చి3(జర్నలిస్ట్ వార్త): రూ. 10 లంచం తీసుకంటూ ఓ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన నిజామాబాద్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కవితా కాంప్లెక్స్ రెండవ అంతస్తులో ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి కి సంబంధించిన ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్టర్ శ్రీరామరాజు సదరు వ్యక్తి వద్ద నుంచి రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయంపై దాడి చేసి లంచం డబ్బులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న శ్రీరామరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

........................................................................

# పట్టుదలతో చదవాలి






## -ప్రిన్సిపల్ పి. అపర్ణ

పర్వతగిరి/మార్చి3(జర్నలిస్ట్ వార్త): విద్యార్థులు ముందున్న పరీక్షల్లో మొదటి స్థానం రావడం కోసం పట్టుదలతో చదవాలని పర్వతగిరి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ పి. అపర్ణ అన్నారు. సోమవారం వైస్ ప్రిన్సిపల్ జోష్న, వైస్ ప్రిన్సిపల్ స్వాతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇల్లందుల రాణి, వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు160 పరీక్ష రైటింగ్ ప్యాడ్స్,160 పెన్నులను పంపిణీ చేశారు. గేమ్స్ లో జాతీయస్థాయిలో అవార్డు వచ్చిన సందర్భంగా ఏం రుచిత కు,బెస్ట్ కెప్టెన్ లకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శాలువా మెమొంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ పి. అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ జోష్న, స్వాతి లు మాట్లాడుతూ తెలంగాణ రాష్టంల్లో పర్వతగిరి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాల విద్యార్థులు ఆటల్లో , పాటలో, కల్చరల్ పోటీలో,చదువు లో ముందు వరుసలో వున్నందుకు గర్విస్తున్నామన్నారు. అందుకు నిదర్శనం వరంగల్ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు హాస్టల్ ను ఎప్పటికప్పుడు పరియావేక్షిస్తూ హాస్టల్ లో అన్ని సదుపాయాలు క్వాలిటితో విద్యార్థులకి అందిస్తున్నారని తెలిపిన విషయం విధితమేనన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం చేరుకోవాలన్న ఆలోచనతో చదివి జరుగన్ను పరీక్షల్లో మొదటి స్థానంలో ఉత్తిర్నాలు కావాలన్నరు. తెలంగాణ ప్రభుత్వం గురుకులల్లో నాణ్యమైన విద్యా, ఉచ్చితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, సోప్ మని రెండు జతల బట్టలు, బ్యాగ్, షూజ్, క్వాలిటి భోజనం అందిస్తుందన్నారు. నిరుపేదలకోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని భావితరాలకు బాసటగా నిలువాలని సూచించారు. గురుకులాల్లో విద్యను అభ్యసించినవారు ఎంతో మంది ఐ ఏ ఎస్, ఐ పిఎస్, డాక్టర్, పోలీస్, ఉపాధ్యాయులుగా తదితర ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని తెలిపారు. మరికొందరు రాజకీయ నాయకులుగా వారి జీవితాలను కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. చదువుపై ఆసక్తి చూపని వారు జీవితంలో చాలా కష్టాలు ఎదుర్కోవల్సిన పరిస్థితి వస్తుందన్నారు.

విద్యార్థి దశలోనే కష్టపడి చదివి వారి జీవితాన్ని ఉన్నత శిఖరాలు అవరోధించే దిశగా పయనిచెలా ఆలోచించాలన్నారు. సమయం చాలా విలువైనదని దాని సద్వినియోగం చేసుకోవల విద్యార్థులకు తెలిపారు. విద్యార్థి దశలో కష్ట పడి చదివితే భవిష్యత్తులో మంచి స్థానంలో ఉంటారన్నారు. బాధ్యతతో భవిష్యత్ ని నిర్మించుకోలని గుర్తుచేశారు. పేదవారి తలరాతలు మార్చేది కేవలం దాడువెనన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు పొన్నగంటి స్వామి, యాదగిరి మాంకాల, ఉపేందర్, సుమన్ సుమలత, గోగుల లావణ్య, ఎల్లపాక స్వప్న, బందరి రాజు, జన్ కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.







# మత్స్యావతారంలో స్వామివారు



యాదగిరిగుట్ట,మార్చి3(జర్నలిస్ట్ వార్త): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 3వ రోజు సోమవారం స్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహన సేవలో తిరుమాఢ వీధుల్లో ఊరేగారు. సాయంత్రం నిత్యహోమం, చతు స్థానార్చనలు నిర్వహించారు. వైకుంఠంలో స్వామివారికి నిరంతరం సేవా కైంకర్యాలు చేసిన వ్యక్తి అనంతుడు. అతనే ఆది శేషు. అలాంటి ఆదిశేషుడిలో ప్రవాసుదేవుడిలా స్వామివారిని అలంకరించి ఆస్థానం చేశారు. వేదాలు, పురాణాలతో ప్రార్థించారు. భక్తజన బాంధవుడు లక్ష్మీనారసింహుడు ప్రీతిపాత్రమైన శేష వాహనుడిపై తిరు మాఢ వీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవ శుభరాత్రుల్లో యాదగిరిగుట్ట కొండపై జ్వాలాకృతిలో సర్పాకారంలో వెలసిన స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆదిశేష వాహనాన్ని భక్తులు కనులారా దర్శించుకున్నారు.

# హైదరాబాద్‌కు వచ్చిన మేధా పాట్కర్

## ఆమెను అడ్డుకుని పంపించివేసిన పోలీసులు



హైదరాబాద్,మార్చి3(జర్నలిస్ట్ వార్త): సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ చాదర్‌ఘాట్‌లో ఒక ఇంటికి వచ్చారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఆమె ఉన్న ఇంటి వద్దకు వచ్చారు. అయితే ఆమె మూసీ సుందరీకరణ ప్రాంతానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సమాచారం. ఈ క్రమంలో పోలీసులు మేధాపాట్కర్‌ను అదుపులోకి తీసుకొని పంపించివేశారు. తాను తన ఫ్రెండ్స్ ఇంటికి మాత్రమే వచ్చానని మేధాపాట్కర్ చెప్పినా పోలీసులు వినలేదు. ఈ ప్రాంతంలో ఉండవద్దంటూ ఆమెను పోలీసులు పంపించి వేశారు. అంతేకాకుండా ఆమెను అదుపులోకి తీసుకుని అనేక ప్రశ్నలు వేశారు. ఈ ప్రాంతంలో ఎవరూ ఉండకూడదని వెళ్లిపోవాలన్నారు. కాగా నర్మదా బచావో అనే నినాదంతో మేధాపాట్కర్ ఓ పర్యావరణ ఉద్యమాన్ని చేపట్టారు. ఆ ఉద్యమంలో భాగంగా ఆమె హైదరాబాద్ వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.